## నాకు ఎంపీ టికెట్ రాకుండా అడ్డుకుంది వారే

### సొంత నేతలపై అంజన్ కుమార్ వివాదాస్పద వ్యాఖ్యలు



**మహా, హైదరాబాద్:** తెలంగాణ కాంగ్రెస్ సీనియర్ నేత, మాజీ ఎంపీ అంజన్ కుమార్ యాదవ్ సంచలన వ్యాఖ్యలు చేశారు. సోమవారం హైదరాబాద్‌లోని ఓల్డ్ ఎమ్మెల్యే క్వార్టర్స్ వద్ద ఆదర్శనగర్‌లో యాదవ సామాజికవర్గ నేతల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అంజన్ కుమార్ యాదవ్ మాట్లాడుతూ.. కులగణన చేపట్టి బీసీ కులాల లెక్కలు తేల్చినందుకు రాష్ట్ర ప్రభుత్వం , సీఎం రేవంత్ రెడ్డికి ధన్యవాదాలు చెప్పారు. 'సికింద్రాబాద్ పార్లమెంట్ ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ తప్పుడు నిర్ణయం తీసుకున్నది. నిజానికి ఈ సీటును కాంగ్రెస్ పార్టీ యాదవులకు కేటాయిస్తే తప్పకుండా గెలిచేది. యాదవులకు ఇవ్వకుండా పార్టీలోనే కొందరు అడ్డు తగిలారు. యాదవ కులస్తులను కాంగ్రెస్ పార్టీలోని కొందరు ఇప్పటికీ అణగదొక్కే ప్రయత్నం చేస్తున్నారు.. తన కొడుకు పార్టీకి చేసిన సేవలను గుర్తించి రాజ్యసభ సీటు ఇచ్చింది. తనకు నేరుగా సోనియా, లాలూ ప్రసాద్ లాంటి వాళ్ళు చెప్పడంతోనే పీసీసీలో చోటు ఇచ్చారని' అంజన్ కుమార్ యాదవ్ సంచలన వ్యాఖ్యలు చేశారు. మాజీ పీసీసీ, మాజీ ఎంపీగా చేసినా ఎక్కడ స్వయంగా నిలబడి ఎన్నికల్లో గెలిచింది లేదని వీహెచ్‌ను ఉద్దేశించి హాట్ కామెంట్స్ చేశారు.

## మహాశివరాత్రికి 3వేల స్పెషల్ బస్సులు



**మహా, హైదరాబాద్:** హైదరాబాద్ నుంచి శ్రీశైలం పుణ్యక్షేత్రానికి వెళ్లాలనుకునే భక్తులకు ఎంజీబీఎస్, జేబీఎస్, సీబీఎస్, ఐఎస్ సదన్, కేబీహెచ్‌బీ, బీహెచ్ఈఎల్ ప్రాంతాల్లో బస్సులు అందుబాటులో ఉంటాయని టీజీఎస్ఆర్టీసీ మేనేజింగ్ డైరెక్టర్ సజ్జనార్ తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా వివిధ ప్రాంతాల నుంచి 43 శైవక్షేత్రాలకు వెళ్లేందుకు 3,000 ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. ఈ ప్రత్యేక బస్సులు ఈ నెల 24 నుంచి 28 వరకూ అందుబాటులో ఉంటాయని అన్నారు. శ్రీశైలానికి 800, వేములవాడకు 714, ఏడుపాయలకు 444, కీసరగుట్టకు 270, వేలకు 171, కాళేశ్వరానికి 80, కొమురవెల్లికి 51 బస్సులతోపాటు అలంపూర్, ఉమామహేశ్వరం, పాలకుర్తి, రామప్ప ఆలయాలకు సైతం ప్రత్యేక బస్సులు నడపనున్నట్లు వెల్లడించారు.



TELUGU DAILY

# మహా పత్రిక

సోమవారం, హైదరాబాద్ | EPAPER.MAHAADAILY.COM | 24-02-2025

BREAKING EDITION 5PM

### ఉద్యోగ, ఉపాధ్యాయ పెన్షనర్లను

## రోడ్డున పడేస్తారా?

### సీఎం రేవంత్‌కు కిషన్‌రెడ్డి బహిరంగ లేఖ



**హైదరాబాద్, మహా:** రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి బహిరంగ లేఖ రాశారు. కాంగ్రెస్ ప్రభుత్వం 14 నెలల పాలనపై కిషన్‌రెడ్డి లేఖ రాశారు. 14 నెలల మీ పాలన అసంతృప్తిగా ఉందని, డీఏలు, జీపీఎఫ్, పెండింగ్ బకాయిలు చెల్లించకుండా ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్లను రోడ్డున పడేస్తారా? అని ప్రశ్నించారు. రిటైర్మెంట్ బెన్ ఫిట్స్ కూడా చెల్లించకుండా మానసిక క్షోభకు గురిచేయడం ఎంత వరకు న్యాయమని అన్నారు. ఉద్యోగులకు రోటీన్ గా చెల్లించాల్సిన బిల్లుల్లో కూడా సీలింగ్ పెట్టడం సిగ్గు చేటన్నారు. నిజాయితీగా పనిచేసే ఉద్యోగులకు మీరు ఏ సందేశం ఇస్తున్నట్లు? అని అన్నారు. కళాశాలల యాజమాన్యాలపట్ల మీ తీరు దుర్మార్గం, ఏళ్ల తరబడి ఫీజు రీయింబర్స్ మెంట్ బకాయిలు చెల్లించకుండా వేధిస్తున్నారని మండిపడ్డారు. 'ఏప్రిల్, మే నెలలో బకాయిలు చెల్లిస్తామని కాలేజీ యాజమాన్యాలను మళ్లీ మభ్యపెట్టడం ఎంత వరకు కరెక్ట్?, ఎమ్మెల్సీ ఎన్నికల్లో గట్టెక్కేందుకు మళ్లీ మోసపూరిత హామీలకు సిద్ధమవడం సిగ్గు చేటు, నిరుద్యోగ భృతి ఆశ చూపి 14 నెలలుగా రూ.56 వేల బకాయిపడి యువతను దగా చేశారు. మీలో ఏమాత్రం నిజాయితీ ఉన్నా యుద్ధ ప్రాతిపదికన బకాయిలు విడుదల చేయండి. ఈరోజే రూ.7500 కోట్ల ఫీజు రీయింబర్స్ మెంట్ సొమ్మును కాలేజీ యాజమాన్యాల ఖాతాల్లో జమ చేయండి' అంటూ కిషన్‌రెడ్డి లేఖలో పేర్కొన్నారు.

## ప్రజలు ఛీకొట్టినా

# కేసీఆర్‌లో మార్పు రాలే

- ఫామ్‌హౌస్‌లో కూర్చుని కుట్రలు చేస్తుండు
- రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా మార్చిండు
- ప్రతినెలా రూ.600 కోట్ల వడ్డీ చెల్లిస్తున్నాం
- ఉద్యోగులకు ఏనాడూ మొదటి తారీఖున వేతనాలివ్వలే
- ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఫైర్
- నిజామాబాద్‌లో పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం



**మహా, నిజామాబాద్:** ప్రజలు ఛీకొట్టినా మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌లో మార్పు రాలేదని, ఫామ్‌హౌస్‌లో కూర్చుని కుట్రలు చేస్తుండని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మండిపడ్డారు. మిగులు బడ్జెట్‌తో ఉన్న తెలంగాణను కేసీఆర్ రూ.7 లక్షల కోట్ల అప్పుల కుప్పగా మార్చారని, వారు చేసిన అప్పులకు ప్రతి నెలా రూ.600 కోట్ల వడ్డీని చెల్లిస్తున్నామని రేవంత్ రెడ్డి అన్నారు. సోమవారం నిజామాబాద్‌లోని పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా రేవంత్ రెడ్డి మాట్లాడుతూ బీఆర్ఎస్, బీజేపీపై తీవ్ర స్థాయిలో విమర్శలు చేశారు. కేసీఆర్ ఫామ్‌హౌస్‌లో కూర్చుని తమ ప్రభుత్వంపై కుట్రలు చేస్తున్నారని ఆరోపించారు. కేసీఆర్ అవసరం రాష్ట్రానికి లేదని, చేసింది చాలు.. ఇక ఫామ్‌హౌస్‌లో విశ్రాంతి తీసుకొమ్మని ప్రజలు తీర్పునిచ్చారని సీఎం రేవంత్ అన్నారు. ప్రజలు తిరస్కరించినా.. కేసీఆర్‌లో మార్పు రాలేదని మండిపడ్డారు. రాష్ట్రంతో పేగుబంధం తెంపుకుంటూ పార్టీ పేరు కూడా మార్చుకున్నారని సీఎం రేవంత్ అన్నారు.

**పోటీలో లేనివారా మమ్మల్ని ప్రశ్నించేది?**

ఎన్నికల్లో పోటీ చేయలేని వాళ్లకి మమ్మల్ని ప్రశ్నించే అర్హత ఉందా? అని సీఎం రేవంత్ ప్రశ్నించారు. ఏ అభ్యర్థికి ఓటెయ్యాలని బీఆర్ఎస్ నేతలు అడుగుతున్నారో చెప్పాలన్నారు. ప్రధాన ప్రతిపక్షంగా చెప్పుకునే ఆ పార్టీలో పోటీ చేసే అభ్యర్థులే లేరని, బీఆర్ఎస్ పార్టీకి రాజకీయ పార్టీగా చెప్పుకునే అర్హతే లేదని ఎద్దేవా చేశారు. పదేళ్లలో బీఆర్ఎస్ పార్టీ ఒక్క ఉద్యోగమైనా ఇచ్చిందా అని ప్రశ్నించారు. కాంగ్రెస్ వచ్చాకే 55,163 నియామకాలు చేపట్టిందన్నారు. అంతేకాదు, గ్రామీణ యువతి యువకుల్లో ఉండే నైపుణ్యాలను బయటి తీసేందుకు స్కిల్ యూనివర్సిటీ ఏర్పాటు చేశామన్నారు. క్రీడల్లో యువత రాణించేందుకు స్పోర్ట్స్ యూనివర్సిటీ ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు.

**ప్రత్యేక రాష్ట్ర సాధనలో పట్టభద్రుల పాత్ర కీలకం**

తెలంగాణ సాధనలో పట్టభద్రులదే కీలక పాత్ర అని సీఎం అన్నారు. పట్టభద్రులు ఆలోచించి ఓటేయ్యాలన్నారు. టాటా కంపెనీతో ఒప్పందం నిజమైతే కాంగ్రెస్ పార్టీకి ఓటెయ్యాలని కోరారు. అలాగే, స్కిల్స్ యూనివర్సిటీ, యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్సిటీ ఏర్పాటు నిజమైతేనే, రైతులకు రుణ మాఫీ నిజమైతేనే, రైతు భరోసా పథకంలో భాగంగా ఏడాది రూ.6 వేలు ఇవ్వడం నిజమైతే, ఉచిత కరెంట్, ఉచిత నీరు ఇవ్వటం నిజమైతేనే, సన్న వడ్లకు రూ.500 బోనస్ ఇచ్చింది నిజమైతేనే ఓటేయ్యాలని రేవంత్ రెడ్డి కోరారు. ఉద్యోగులు పదవీ విరమణ చేస్తే వారికి ఎలాంటి ప్రయోజనాలు ఇవ్వలేని స్థితికి రాష్ట్రాన్ని తీసుకువెళ్లారని సీఎం విమర్శించారు. పదవీ విరమణ చేసిన ఉద్యోగులకు రూ.8 వేల కోట్ల బకాయిలు పెట్టి వెళ్లారని అన్నారు. గత ప్రభుత్వం పదేళ్ల పాటు ఉపాధ్యాయులకు పదోన్నతులు, బదిలీలు కల్పించలేదని విమర్శించారు. కానీ తమ ప్రభుత్వం అధికారంలోకి రాగానే వాటిని పూర్తిచేశామని ఆయన తెలిపారు. రాహుల్ గాంధీ ఆశయ సాధన మేరకు తమ ప్రభుత్వం కులగణన చేపట్టిందని ఆయన అన్నారు. దేశంలో ఎవరూ చేయలేని సాహసం తాము చేశామని ఆయన అన్నారు. వందేళ్లుగా జరగని కులగణనను తాము సమర్థవంతంగా నిర్వహించామని అన్నారు.


### బండి సంజయ్ దమ్ముంటే వారిని రప్పించు..

## 48 గంటల్లో బొక్కలో వేస్తాం..

ఫోన్ ట్యాపింగ్ కేసులో ప్రభాకర్‌రావు, శ్రవణ్‌రావు అమెరికా పారిపోతే ప్రధాని మోదీ, కేంద్రమంత్రి బండి సంజయ్ లేఖ రాసి ఎందుకు స్వదేశానికి తీసుకురావడం లేదని సీఎం ప్రశ్నించారు. ఈ కేసులో కేసీఆర్, కేటీఆర్ అరెస్ట్ కాకుండా కాపాడుతున్నదే కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్ అని ఆరోపించారు. 'ఎప్పుడు అమెరికా నుంచి తీసుకువస్తారో చెప్పండి, రాష్ట్రానికి తెచ్చిన 48 గంటల్లో బీఆర్ఎస్ నాయకులను బొక్కలో వేస్తాం' అని రేవంత్ స్పష్టం చేశారు. కేసీఆర్ అసెంబ్లీకి రారు, ఆ పార్టీ ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీ చేయదు గానీ ఉప ఎన్నికలు వస్తే మా తడాఖా చూపిస్తామని అంటున్నారని ముఖ్యమంత్రి విమర్శించారు. పదేళ్లలో ఎంతోమంది ఎమ్మెల్యేలను కేసీఆర్ తన పార్టీలో చేర్చుకున్నారని, టీడీపీ నుంచి గెలిచిన తలసాని శ్రీనివాస్‌ను టీఆర్ఎస్‌లో చేర్చుకుని మంత్రిని చేయలేదా? కాంగ్రెస్ నుంచి గెలిచిన సబితా ఇంద్రారెడ్డిని మంత్రి పదవి ఇవ్వలేదా? అని ప్రశ్నించారు. అప్పుడు రాని ఉప ఎన్నికలు ఇప్పుడెక్కడి నుంచి వస్తాయని అన్నారు.

### రాజాసింగ్‌కు మరోసారి

## బెదిరింపు కాల్స్



**మహా, హైదరాబాద్:** గోషామహల్ బీజేపీ ఎమ్మెల్యే రాజాసింగ్‌కు ఆగంతకుల నుంచి సోమవారం మరోసారి బెదిరింపు కాల్స్ వచ్చాయి. ఈ రోజు కాకపోతే రేపైనా నీ తల నరికేస్తామని ఆగంతకులు తనను బెదిరించినట్లు రాజాసింగ్ తెలిపారు. రెండు గుర్తు తెలియని ఫోన్ నంబర్ల నుంచి బెదిరింపులు వచ్చినట్లు చెప్పారు. గతంలోనూ రాజాసింగ్‌కు పాకిస్తాన్,ఆఫ్ఘనిస్తాన్ నుంచి బెదిరింపులు వచ్చాయి. ఈ బెదిరింపులపై అప్పట్లో రాజాసింగ్ పోలీసులకు ఫిర్యాదు చేయగా నిందితులను గుర్తించి పట్టుకున్నారు. రాజాసింగ్‌కు హత్యకు కుట్రపన్నినట్లు నిందితులు పోలీసుల విచారణలో వెల్లడించారు. శివ స్వాముల పై లాఠీఛార్జ్ పై మండిపాటు మాలలో ఉన్న శివ స్వాములపై పోలీసులు లాఠీ ఛార్జ్ చేయడం ఎంత వరకు న్యాయమని ప్రశ్నించారు. శ్రీశైలాన్ని అపవిత్రం చేయాలని కొందరు కుట్రలు చేస్తున్నారని మండిపడ్డారు. గతంలో ముస్లింలకు షాప్‌లు కేటాయించారని, శివస్వాములపై పోలీసుల లాఠీచార్జ్ సరికాదని అన్నారు. అలాగే పవిత్ర క్షేత్రాల వద్ద ముస్లింలకు ఆలయాల దగ్గర షాపులు కేటాయించొద్దని, సీఎం చంద్రబాబు , డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ కు విజ్ఞప్తి చేస్తున్నానని ఎమ్మెల్యే రాజాసింగ్ అన్నారు.

## రేవంత్ విజన్ ఉన్న నాయకుడు

### పీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్‌గౌడ్



**మహా, హైదరాబాద్:** తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి విజన్ ఉన్న నాయకుడని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్ అన్నారు. నిజామాబాద్‌లో సోమవారం కాంగ్రెస్ పట్టభద్రుల ఆత్మీయ సమేళనం జరిగింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న పీసీసీ చీఫ్ మాట్లాడుతూ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. సీఎం రేవంత్ రెడ్డి విజన్ ఉన్న నాయకుడని, ధైర్యం ఉంది కాబట్టే సీఎం అయ్యాడని అన్నారు. తెలంగాణ ప్రజలను కేసీఆర్ పదేళ్లు ఆశల పల్లకి లో ఊరేగించారని మండిపడ్డారు. కాంగ్రెస్ 9 నెలల్లో 50 వేల ఉద్యోగాలిచ్చిందని అన్నారు. కేంద్ర ప్రభుత్వం దేశంలో 2 కోట్ల ఉద్యోగాలు పీకేసిందని ఆరోపించారు. ఇప్పుడు ఏ ముఖం పెట్టుకుని ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓట్లు అడుగుతున్నారని బీజేపీ తీరుపై మండిపడ్డారు

BREAKING EDITION
బ్రేకింగ్ ఎడిషన్

Follow: @ANNTELUGU
మహా పత్రిక
సోమవారం, హైదరాబాద్ 24-02-2025
W W W . E P A P E R . M A H A A D A I L Y . C O M
ANN తెలుగు



# కోహ్లీ కన్నా కేసీఆర్‌దే పెద్ద రికార్డు

## మాజీ సీఎంపై కొండా సురేఖ సెటైరికల్ ట్వీట్ సర్వత్రా హాట్ టాపిక్

**మహా, హైదరాబాద్:** మాజీ సీఎం, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌పై మంత్రి కొండా సురేఖ సెటైర్లు పేల్చారు. అసెంబ్లీ ఎన్నికల తర్వాత ప్రతిపక్ష హోదా అందుకున్న కేసీఆర్.. అసెంబ్లీకి రాకపోవడం, ప్రజా సమస్యలపై ఎక్కడా గళమెత్తి ప్రశ్నించకపోవడంపై కొండా సురేఖ ప్రశ్నించారు. ఈమేరకు తనదైన శైలిలో ఎక్స్(ట్విట్టర్) వేదికగా ఆసక్తికర పోస్ట్ పెట్టారు. ప్రస్తుతం ఈ పోస్ట్ సోషల్ మీడియాలో వైరల్ మారుతోంది. నిన్న దుబాయ్ వేదికగా జరిగిన ఇండియా, పాకిస్థాన్ మ్యాచ్‌ను ప్రస్తావిస్తూ కొండా సురేఖ.. కేసీఆర్‌పై సెటైర్లు పేల్చారు. పాకిస్థాన్‌పై సెంచరీ చేసి కోహ్లీ సాధించిన రికార్డు కంటే ఫామ్ హౌస్‌లో ఉండి కేసీఆర్ చేసిన రికార్డ్ ఇంకా పెద్దదంటూ చురకలంటించారు.

**కొండా సురేఖ పోస్ట్ ఇదే..**

"దుబాయ్ వేదికగా పాకిస్థాన్‌తో జరిగిన మ్యాచ్‌లో టీమిండియా ఘన విజయం సాధించడం హర్షణీయం. 6 వికెట్ల తేడాతో భారత్ బంపర్ విక్టరీ కొట్టిన విషయం మన అందరం టీవీలో చూసి సంబురపడినం. 14 వేల పరుగులు చేసి విరాట్ కోహ్లీ.. సచిన్ రికార్డు బద్దలు కొట్టగా... మన రాష్ట్ర ప్రతిపక్ష నేత కేసీఆర్ కూడా దాదాపు ఈ 14 నెలల కాలంలో 14 రోజులు కూడా అసెంబ్లీకి రాకపోవడం... ప్రజా సమస్యలపై ప్రజలకి అందుబాటులో ఉండకపోవడం దేశ రాజకీయ చరిత్రలో పెద్ద రికార్డే కదా. 14 వేల రన్నులు చేసిన విరాట్ కోహ్లీ ఒకవైపు వార్తల్లో పతాక శీర్షికలలో నిలిస్తే... 14 నెలలుగా ఇంకా విరాట పర్వం వీడని మన ప్రతిపక్ష నేత కేసీఆర్ కూడా వార్తల్లోకి ఎక్కడం ఆలోచించాల్సిన విషయం కాదా?" అంటూ పంచ్‌లు పేల్చారు మంత్రి. మాజీ సీఎంపై మంత్రి కొండా సురేఖ చేసిన కామెంట్స్‌ను ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది.



# బయో హబ్‌గా హైదరాబాద్

## ప్రపంచ స్థాయి నగరంగా ఎదుగుతోంది



### లైఫ్ సైన్సెస్ రంగంలో విస్తృత అవకాశాలు

## ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

### ఆమ్జెన్ సంస్థ కార్యాలయాన్ని ప్రారంభించిన సీఎం

**మహా, హైదరాబాద్:** ఆమ్జెన్ కంపెనీ రాకతో బయో సైన్స్ లో హైదరాబాద్ హబ్ గా మారుతోందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. అమెరికాలోనే అతి పెద్ద బయో టెక్నాలజీ కంపెనీ ఆమ్జెన్ హైదరాబాద్ లో తమ న్యూ టెక్నాలజీ, ఇన్నోవేషన్ సైట్ ను ప్రారంభించింది. హైటెక్ సిటీ సమీపంలో ని అమ్జెన్ కార్యాలయ ప్రాంగణంలో ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి, ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి డి. శ్రీధర్ బాబు అమ్జెన్ ఇన్నోవేషన్ సైట్ ను సోమవారం లాంచనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో అమ్జెన్ చైర్మన్, చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ రాబర్ట్ ఎ. బ్రాడ్వే, అమెరికా కాన్సుల్ జనరల్ జెన్నిఫర్ లార్సెన్, అమ్జెన్ ఇండియా ప్రతినిధి సోమ్ చటోపాధ్యాయ, అమ్జెన్ ఇండియా మేనేజింగ్ డైరెక్టర్ నవీన్ గుల్లపల్లి పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ముఖ్యమంత్రి మాట్లాడుతూ.. ఆమ్జెన్ కంపెనీ రాకతో బయో సైన్స్ లో హైదరాబాద్ హబ్ గా మారుతుందని అన్నారు. లైఫ్ సైన్సెస్ రంగంలో హైదరాబాద్ లో విస్తృత అవకాశాలు ఉన్నాయని చెప్పారు. యామ్ జెన్ సంస్థ హైదరాబాద్ ను ఎంచుకోవడం ఆనందంగా ఉందన్నారు. ట్రిలియన్ డాలర్ డీజీపీ స్టేట్ గా తెలంగాణను మార్చడమే మా విజన్ అన్నారు. ఈ విషయంలో నేను మీకు భరోసా ఇస్తున్నానన్నారు. హైదరాబాద్ ప్రపంచంలోని గొప్ప నగరాలలో ఒకటిగా అత్యంత వేగంగా అవతరించబోతున్నదన్నారు. ఇందులో మీ అందరిని భాగస్వాములుగా ఆహ్వానిస్తున్నానని కలిసి భవిష్యత్ ను నిర్మిద్దామని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ.. హైదరాబాద్ ఎన్నోవేషన్ కు హబ్ గా మారుతుందని చెప్పారు. ఉద్యోగులకు స్కిల్, అప్ స్కిల్ ప్రోగ్రామ్ కండక్ట్ చేస్తామని చెప్పారు. ఆమ్జెన్ ఇండియా కొత్త అధ్యాయం ప్రారంభించిందన్నారు.

**బయో ఫార్మా రంగంలో ఉద్యోగాలు:**

అమ్జెన్ సంస్థ విస్తరణలో భాగంగా 2025 నాటికి 200 మిలియన్ డాలర్లు (దాదాపు రూ.1600 కోట్లు) పెట్టుబడి పెట్టబోతున్నది. రాబోయే సంవత్సరాల్లో మరిన్ని పెట్టుబడులకు ప్రణాళిక చేస్తోంది. దీంతో బయో ఫార్మా రంగంలో మరిన్ని ఉద్యోగ అవకాశాలు కల్పించనుంది. అమ్జెన్ తమ ఔషధాల శ్రేణిని మరింత అభివృద్ధి చేసేందుకు రాష్ట్రంలో కార్యకలాపాలను విస్తరిస్తుంది. ఏఐ, డేటా సైన్స్ తో డిజిటల్ సామర్థ్యాలను ఈ కొత్త సైట్ అందిస్తోంది.

# మహిళా రిజర్వేషన్లపై కేంద్రానికి చిత్తశుద్ధి లేదు




**మహా, హైదరాబాద్:** మహిళా రిజర్వేషన్ల అమలులో కేంద్రానికి చిత్తశుద్ధి లేదని జాతీయ మహిళా కాంగ్రెస్ అధ్యక్ష్యురాలు అల్కాలాంబా మండిపడ్డారు. వెంటనే అమలు చేయాల్సిందేనని ఆమె డిమాండ్ చేశారు. సోమవారం ఆమె గాంధీభవన్‌లో మీడియాతో మాట్లాడారు. మహిళల రక్షణ కోసం కేంద్రం చర్యలు తీసుకోవాలని కోరారు. మహిళా కాంగ్రెస్ సభ్యత్వంలో దేశంలోనే తెలంగాణ నం.1 అంటూ వెల్లడించారు. దేశంలో ఐదు లక్షల మంది మహిళా కాంగ్రెస్‌లో ఆన్‌లైన్ ద్వారా రిజిస్టర్ చేసుకున్నారని, అందులో తెలంగాణ నుంచే లక్షమంది ఉన్నారని చెప్పారు. ఇప్పటివరకూ లక్షా 4 వేల మంది తెలంగాణ మహిళా కాంగ్రెస్‌లో సభ్యత్వం తీసుకోవడంతో దేశంలోనే తెలంగాణ నంబర్ .1 గా ఉందని హర్షం వ్యక్తం చేశారు.

**రాష్ట్రంలో రేవంత్ పాలన భేష్..**

తెలంగాణలో రేవంత్ పాలన అద్భుతంగా ఉందని ఆమె అన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి రావడానికి సగం మహిళల పాత్ర కూడా ఉందని చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వ ఆధ్వర్యంలో దేశంలో రూ. 500 సిలిండర్ కేవలం తెలంగాణలోనే లభిస్తుందన్నారు. తెలంగాణలో ఇప్పటికే మహిళలకు మూడు హామీలు నెరవేర్చామని వెల్లడించారు. త్వరలో నాలుగో హామీ కూడా ఇంప్లిమెంట్ చేస్తామని పేర్కొన్నారు. దేశంలో మహిళా పెట్రోల్ బంక్ ఎక్కడా లేదని, తెలంగాణలోనే మొదటిసారిగా మహిళా పెట్రోల్ బంక్ ఏర్పాటు అయిందని కొనియాడారు. కమిటీల్లో తెలంగాణలో ప్రతి పోలింగ్ కేంద్రంలో ముగ్గురు మహిళలను నియమించడానికి మహిళా కాంగ్రెస్ సిద్ధమవుతోందని తెలిపారు. నిన్న మహిళా కాంగ్రెస్ పూర్తిస్థాయిలో కార్యవర్గం ప్రకటించిందని, అందులో అన్ని జిల్లా అధ్యక్ష్యులు ఉన్నారని తెలిపారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం రోజున దేశవ్యాప్తంగా, తెలంగాణ నుంచి మహిళలను ఢిల్లీలో ప్రియాంక గాంధీ సత్కరిస్తారని చెప్పారు.

# రాష్ట్రం అప్పుల కుప్ప

- మాజీ సీఎం కేసీఆరే కారణం
- బీజేపీ ఎంపీ లక్ష్మణ్



**మహా, హైదరాబాద్:** బీజేపీ ఎంపీ కె. లక్ష్మణ్ సంచలన వ్యాఖ్యలు చేశారు. సోమవారం ఆయన నల్లగొండ జిల్లా పార్టీ కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ మాజీ సీఎం కేసీఆర్, ప్రస్తుత సీఎం రేవంత్ రెడ్డి పైన పలు సంచలన వ్యాఖ్యలు చేశారు. కేసీఆర్, రేవంత్ రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా మార్చరాని మండిపడ్డారు. మాజీ సీఎం రాష్ట్రం మీద రూ.7 లక్షల కోట్లు అప్పు చేసి రేవంత్ రెడ్డి చేతుల్లో పెట్టారని, ప్రస్తుత సీఎం అనుభవం లేక రాష్ట్రాన్ని మరింత అప్పుల ఊబిలో పడేశారు అని ఆగ్రహం వ్యక్తం చేశారు. కనీసం పదవీ విరమణ పొందిన ఉద్యోగులకు ఇచ్చే బెనిఫిట్స్ ఇవ్వలేని స్థితిలో ప్రభుత్వం ఉందని విమర్శించారు. ఉద్యోగ విరమణ బెనిఫిట్స్ కోసం కోర్టుకు వెళ్ళి సాధించుకోవాల్సిన దారుణ ఆర్థిక పరిస్థితులు రాష్ట్రంలో ఉన్నాయని అన్నారు. ప్రభుత్వ ఉద్యోగులకు సరైన వైద్య సేవలు అనడటం లేదని, బిల్లులు చెల్లించకపోవడంతో ఉద్యోగుల ఆరోగ్య పథకాన్ని ఆసుపత్రులు పట్టించుకోవడం లేదని వాపోయారు. ఐదేళ్లకు ఓసారి పీఆర్సీ అమలు చేయాల్సి ఉండగా.. దానిని పట్టించుకోవడం లేదని, ఐదు డీఏలను పెండింగ్ లో పెట్టిందని ఆరోపించారు.

# మరో ఎన్నికల నగారా

- ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ ఎన్నికల షెడ్యూల్ విడుదల
- మార్చి 3న నోటిఫికేషన్, 20న పోలింగ్




**మహా, న్యూఢిల్లీ:** తెలుగు రాష్ట్రాల్లో మరో ఎన్నికల నగారా మోగింది. ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ ఎన్నికల షెడ్యూల్‌ను ఎన్నికల సంఘం విడుదల చేసింది. ఎమ్మెల్యే కోటాలో ఎమ్మెల్సీ ఎన్నికలను నిర్వహించనుంది. మార్చి 29లోగా తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లో ఐదుగురు ఎమ్మెల్సీల పదవీకాలం ముగియనుంది. ఈ క్రమంలోనే సోమవారం సీఈసీ షెడ్యూల్‌ను ప్రకటించింది. ఆంధ్రప్రదేశ్‌లో జంగా కృష్ణమూర్తి, రామకృష్ణుడు యనమల, పరుచూరి అశోక్‌బాబు, తిరుమలనాయుడు, దువ్వరపు రామారావు రిటైర్ కానున్నారు. తెలంగాణలో మహమూద్ అలీ, సత్యవతి రాథోడ్, శేరి సుభాష్‌రెడ్డి, ఎగ్గె మల్లేశం, రియాజుల్ హుస్సేన్ పదవి కాలం ముగియనున్నది.

**ఎన్నికల షెడ్యూల్ ఇదే..**

మార్చి 3న ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ ఎన్నికల నోటిఫికేషన్ విడుదల చేయనుంది. మార్చి 10 వరకు నామినేషన్‌ల స్వీకరణ, 11న నామినేషన్ల పరిశీలన, నామినేషన్ల ఉపసంహరణకు మార్చి 13 వరకు గడువు విధించింది. 20న పోలింగ్ జరగనున్నాయి. పోలింగ్ ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 వరకు కొనసాగనుంది.

# వారంతా సజీవ సమాధే!

## ప్రకటించిన సహాయ రక్షణ బృందాలు

### మృతదేహాల వెలికితీతకు నెల రోజులు పడుతుందన్న ఎన్డీఆర్ఎఫ్





**మహా, నల్లగొండ:** ఎస్ ఎల్ బీసీ టన్నెల్ లో చిక్కుకుపోయిన ఎనిమిది మంది సజీవ సమాధి అయి ఉంటారని సహాయ రక్షణ బృందాలు ప్రకటించాయి.. నెల రోజుల తర్వాత కానీ మృతదేహాలు తీయలేమంటూ ఎన్డీఆర్ఎఫ్ క్లారిటీ ఇచ్చింది. టన్నెల్ లో చిక్కుకున్న వాళ్ళు 48 గంటలుగా ఆక్సీజన్ లేకపోవడంతో ప్రాణాలతో ఉంటారని భావించలేమని తెలిపారు. అక్కడ ఉన్న మృతదేహాలను టన్నెల్ బోరింగ్ మిషన్ ను పూర్తిగా కట్ చేయాల్సిందేనని ఎన్డీఆర్ఎఫ్ అధికారులు అంటున్నారు. శిథిలాల తొలగించడానికి దాదాపు నెల రోజుల సమయం పడుతుందని...అప్పుడుగాని లోపల చిక్కుకున్న వారిని బయటకు తీసుకురాలేమని చెబుతున్నారు అధికారులు. సోమవారం ఉదయం మద్రాస్ ఐఐటి నుంచి వచ్చిన నిపుణుల బృందంతో లోపలకి వెళ్లిన ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్ సిబ్బంది అక్కడ పరిస్థితిని సమీక్షించారు. టన్నెల్ ప్రమాదం జరిగిన 14వ కిలో మీటర్ నుంచి వెనకకు 11 కిలో మీటర్ వరకు మొత్తం నీరు, బురద కొండ రాళ్లతో మూసుకుపోయిందని గుర్తించారు.. మూడు కిలోమీటర్ల పడిన కొండరాళ్లతో కూడిన బురదను, నీళ్లను తోడటం కష్టసాధ్యమైన విషయమని మద్రాస్ ఐఐటి నిపుణులు తెలిపారు.. ఇక టన్నెల్ లో 14 కిలో మీటర్ల ప్రాంతంలో ప్రమాదం జరిగితే అక్కడి నుంచి దాదాపు 500 మీటర్ల వరకు మట్టి, సిమెంట్ రింగుల శిథిలాలతో సొరంగం మూసుకుపోయిందని తెలిపారు. ఇదే ఇప్పుడు సహాయ చర్యలను తీవ్రంగా ప్రభావితం చేస్తోందని అంటున్నారు. సాధారణంగా సొరంగంలోకి వెళ్లేందుకు, కార్మికులను, యంత్ర పరికరాలను తరలించేందుకు రైల్వే ట్రాక్కు ఏర్పాటు చేశారు.. దీంతో వేరే భారీ యంత్రాలు కూడా లోపలికి తీసుకుపోయే అవకాశం లేకుండా పోయిందని తెలిపారు. కూలిపోయిన శిథి లాలను తరలించాలంటే ప్రస్తుతం ఏకైక మార్గం రైల్వేట్రాక్. ఆ మార్గంలోనే శిథి లాలను బయటకు తీసుకురావాల్సి ఉంది. ట్రాక్ కూడా దాదాపు మూడు కిలోమీటర్ల వరకు నీటిలో మునిగిందని అన్నారు. నడుము లోతు వరకు నీరు, బురద పేరుకుపోయిందని తెలిపారు. ప్రమాదం జరిగిన ప్రాంతంలో కరెంటును కూడా పునరద్ధరించలేని పరిస్థితి అని చెప్పారు. సహాయ కార్యక్రమాలు నిపుణుల సలహాతో కొనసాగిస్తామని తెలిపారు.

**రంగంలో ఆక్వా ఐ కెమెరా..**

ఎస్ ఎల్ బీసీ టన్నెల్ లో బురద సమాధిలో చిక్కిన మృతదేహాలను గుర్తించేందుకు అత్యధిక సాంకేతిక పరిజ్ఞానంతో గుర్తించాలని సహాయక బృందాలు నిర్ణయం తీసుకున్నాయి. ఇందుకు ఎల్ అండ్ టీ సంస్థ అంగీకరించింది. ఆక్వా ఐ కెమెరాతో ఎనిమిది మందిని గుర్తించే ప్రయత్నాలు ప్రారంభమయ్యాయి. సోమవారం ఉదయం హైదరాబాద్ లోని ఎల్ అండ్ టీ సంస్థ తమ ఆక్వా ఐ కెమెరాను దోమకుంటకు పంపించింది. ఈ కెమెరాలో 50 అడుగుల లోతులోని లక్ష్యాలను గుర్తించే సాంకేతికత ఉంది. ఈ స్థితిలో సొరంగంలో మూడు కిలోమీటర్లలో పేరుకుపోయిన బురద, ఇతర శిథిలాల్లో అడుగున చిక్కిన మృతదేహాలను గుర్తించే అవకాశం ఉంది. దీంతో కొన్ని గంటల వ్యవధిలోనే ఎనిమిది మంది మరణ వార్త ప్రపంచానికి తెలియనుంది.